# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

● డీఆర్డీవో శేషాద్రి

నెన్నెల, అక్టోబర్ 7 : మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థిక ప్రగతి సాధించాలని డీఆర్డీవో శేషాద్రి సూచించారు. శనివారం మండలంలోని మన్నెగూడెం, కర్జీ గ్రామంలో మహిళా సంఘాలకు సెర్ప్ ద్వారా రుణాలు అందించి వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులకు న్యూ ఎంటర్‌ప్రైజెస్ పథకం ద్వారా కోళ్ల ఫారం, పవర్ వీడర్స్, కిరాణా దుకాణాల యూనిట్లు అందించినట్లు తెలిపారు. వాటి ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదుగుతారన్నారు. మహిళలు ప్రతి పనిలో ముందుండాలని పిలుపునిచ్చారు. వంటింటికే కాకుండా వ్యవసాయం, కోళ్ల ఫారాలు ఇతర వ్యాపారాలు సాగించాలన్నారు. ప్రతి సభ్యురాలు క్రమం తప్పకుండా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే రుణాలు ఇతరులకు కూడా అందించే వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, సర్పంచ్‌లు బాపు, సత్యనారాయణ, ఏపీఎం విజయలక్ష్మి నాయకులు సాగర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, గ్రామ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



నాటుకోళ్ల పెంపకం ఫారాన్ని ప్రారంభిస్తున్న డీఆర్డీవో శేషాద్రి, ఎంపీపీ రమాదేవి

## అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



బీటీ రోడ్, కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

తాండూర్, అక్టోబర్ 7 : మండలంలోని చౌటపల్లిలో రూ. 1. 20 కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు, రూ.35 లక్షలతో నిర్మించనున్న కల్వర్టు నిర్మాణ పనులు, రూ.10లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణ పనులకు శనివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రారంభించారు. అనంతరం స్పోర్ట్స్ కిట్స్, బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్, జడ్పీటీసీ సాలి గామ బానయ్య, సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ, బుగ్గ దేవస్థానం చైర్‌పర్సన్ మాసాడి శ్రీదేవి, ఎంపీటీసీ సిరంగి శంకర్, నాయకులు ముదాం రఘు, ఏల్పుల రాజు, మాసాడి తిరుపతి, చాందా సురేశ్, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, సంబంధిత అధికారులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. .

# గొర్రెల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

● నెన్నెల ఎంపీపీ రమాదేవి ● గొర్రెల యూనిట్లు పంపిణీ

నెన్నెల, అక్టోబర్7: గొర్రెల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని నెన్నెల ఎంపీపీ రమాదేవి అన్నారు. శనివారం మండలంలోని నార్వాయిపేట, గొల్లపల్లి గ్రామాల్లో రెండవ విడుతలో భాగంగా ఆరు గొర్రెల యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సబ్సిడీపై గొర్రెల పంపిణీ పథకంతో గొల్ల, కుర్మలు ఆర్థికాభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. ఈ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఆరుగురు లబ్ధిదారులకు గొర్రెలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఇందూరి శశికళ, నీల, వెటర్నరీ వైద్యుడు దిలీప్, బీఆర్‌ఎస్ నాయకులు రాంచందర్, ప్రతాప్‌రెడ్డి, నారాయణ, ఇందూరి రమేశ్, రైతులు పాల్గొన్నారు.



నార్వాయిపేటలో గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ రమాదేవి, నాయకులు

## నేడు జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీలు

బెల్లంపల్లి, అక్టోబర్ 7: జిల్లా స్థాయి సీనియర్స్ సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీలు ఆదివారం పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పోచన్న, ప్రధానకార్యదర్శి కిరణ్, కార్యదర్శి వెంకటేశ్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

## పోలీస్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి సన్మానం

కాసిపేట, అక్టోబర్ 7 : మండలంలోని కోమటిచేను గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఇటీవల పోలీస్ ఉద్యోగాలకు ఎంపికైన యువకులను కోమటిచేను సర్పంచ్ రాంటెంకి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించి అభినందించారు. పోలీస్ ఉద్యోగాలకు ఎంపికైన మారం రాజన్న, అజ్మీరా సాయి తేజను ఆదర్శంగా తీసుకొని ఉద్యోగాలు సాధించాలని యువకులకు సర్పంచ్ రాంటెంకి శ్రీనివాస్ సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గుర్రం ఉదయ్ కుమార్, ఉప సర్పంచ్ దుర్గం సూర్య ప్రకాశ్, వార్డు సభ్యులు బానోత్ లక్ష్మణ్, కుర్సింగ సోనేరావు, ఆడె శేఖర్, యూత్ సభ్యులు సంకూరి సురేశ్, కుర్సింగ వసంతరావు, వంశీ తదితరులున్నారు.

## నవంబర్‌లో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 7 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు నవంబర్ రెండవ వారంలో ఎన్‌సీఈఆర్‌టీ మార్గదర్శకాల ప్రకారం జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు నిర్వహించేందుకు జిల్లా శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ జిల్లా స్థాయి సైన్స్, గణితం, పర్యావరణ ప్రదర్శన (డీఎల్‌ఎస్‌ఎంఈఈ)ను రాజ్య స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన(ఆర్‌ఎస్‌బీవీపీ) 2023–24 పోటీలను 'సమాజం కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ' అంశంపై పోటీలు నిర్వహించనున్నారు. ఉప అంశాలుగా ఆరోగ్యం, లైఫ్ (పర్యావరణానికి జీవనశైలి), వ్యవసాయం, కమ్యూనికేషన్ అండ్ రవాణా, కంప్యూటేషనల్ థింకింగ్‌లతో పాటు 'సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సొసైటీ' థీమ్‌కు సంబంధించి ఏదైనా ఉప థీమ్‌పై వినూత్న నమూనాలను అభివృద్ధి చేయవచ్చు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులతో నాణ్యమైన ప్రాజెక్టులు రూపొందించేందుకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, స్పెషల్ ఆఫీసర్లు సంసిద్ధులను చేయాలని డీఈవో యాదయ్య తెలిపారు. జిల్లా స్థాయిలో విద్యార్థులకు 'ఆరోగ్యం – సుస్థిర గ్రహం కోసం మిల్లెట్స్' అంశంపై సెమినార్లు సైతం నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి (98495 50200)ని సంప్రదించాలని సూచించారు.

## బతుకమ్మ చీరెల పంపిణీ

కాటసిపేట, అక్టోబర్ 7 : సోమగూడెం గ్రామ పంచాయతీలో శనివారం తెలంగాణ ప్రభుత్వం మహిళలకు అందించిన బతుకమ్మ చీరలను సర్పంచ్ ప్రమీలాగౌడ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. దసరా, బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు ప్రభుత్వం చీరలను పంపిణీ చేయడంపై మహిళలు సంతోషిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చుంచు మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి రాయలింగు, వార్డు సభ్యులు కొరకొప్పుల రమ, సల్మా, బెడద భాగ్య, ఉస్కమల్ల వివేక్, పెసరి రాజేశం, చీమల శైలజ, కోఆప్షన్ సభ్యుడు పిండి సారయ్య, యూత్ నాయకులు విజయ్, కారోబార్ ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



కాసిపేట : చీరెలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ ప్రమీలాగౌడ్

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

కాసిపేట, అక్టోబర్ 7 : కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెం వద్ద అక్రమంగా ఐచర్ మినీ వ్యాన్‌లో తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు కాసిపేట ఎస్ఐ గంగారాం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... రెబ్బెన నారాయణపూర్‌కు చెందిన రేను కృష్ణ కుమార్, దేవాపూర్‌కు చెందిన తంగేడిపల్లి అరవింద్ దేవాపూర్ ప్రాంతంలో ప్రజలను మోసం చేస్తూ వారి వద్ద నుంచి పది రూపాయలకు కిలో చొప్పున రేషన్ బియ్యం కొనుగోలు చేసి దానిని రేను కృష్ణ కుమార్ సహాయంతో అతని ఐచర్ మినీ వ్యాన్‌లో మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు వివరించారు.

## విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి

బెల్లంపల్లి, అక్టోబర్ 7: విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచి, నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శైలజ సూచించారు. ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతుల్లోని బోధనను ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, కళాశాల పలు రికార్డులను తనిఖీ చేశారు. లెక్చరర్ల టీచింగ్ డైరీలను పరిశీలించారు. డిసెంబర్ నాటికి సిలబస్‌ను పూర్తి చేసి పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యేలా తీర్చిదిద్దాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆవుల అంజయ్య, పీడీ బాబురావు ఉన్నారు.

## స్పోర్ట్స్ కిట‌ల పంపిణీ

కాసిపేట, అక్టోబర్ 7 : కాసిపేట మండలంలోని సోమగూడెం(కే) గ్రామ పంచాయతీలో తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన క్రీడా సామాగ్రిని సర్పంచ్ సపాట్ శంకర్, ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్ చేతుల మీదుగా క్రీడాకారులకు అందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కీర్తి, బూడిద రమేశ్, ప్రశాంత్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



కాసిపేట : సోమగూడెం(కే)లో కిట్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శంకర్

**సోమగూడెం భరత్ కాలనీలో..**

సోమగూడెం భరత్ కాలనీ గ్రామ పంచాయతీలో క్రీడా సామగ్రిని సోమగూడెం సర్పంచ్ కొరికొప్పుల ప్రమీలాగౌడ్ చేతుల మీదుగా క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చుంచు మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి రాయలింగు, వార్డు సభ్యులు కొరకొప్పుల రమ, సల్మా, బెడద భాగ్య, ఉస్కమల్ల వివేక్, పెసరి రాజేశం, చీమల శైలజ, కో ఆప్షన్ సభ్యుడు పిండి సారయ్య, యూత్ నాయకులు విజయ్, కారోబారి ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

**తిమ్మాపూర్‌లో..**

జన్నారం, అక్టోబర్ 7 : మండలంలోని తిమ్మాపూర్‌లో శనివారం సర్పంచ్ జాడి గంగాధర్ ఆధ్వర్యంలో కేసీఆర్ క్రీడా కిట్‌ను గ్రామ యూత్ సభ్యులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రయ్య, వెంకట్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



జన్నారం: తిమ్మాపూర్‌లో క్రీడా కిట్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ జాడి గంగాధర్

## అభివృద్ధి పనులు ప్రారంభం

వేమనపల్లి, అక్టోబర్ 7 : వేమనపల్లి మండలంలో శనివారం పలు అభివృద్ధి పనులను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోళి వేణుమాధవ్ రావు ప్రారంభించారు. బుయ్యారంలో డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.5 లక్షలతో డ్రైనేజీ పనులు, సూరారం గ్రామ పంచాయతీలో ఎస్‌డీఎఫ్ నిధుల రూ.10 లక్షలతో ఎస్‌డీఎఫ్ సీసీ రోడ్డు, చామనపల్లి గ్రామ పంచాయతీ బొమ్మెన గ్రామంలో రూ.10 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో, బద్దెంపల్లిలో రూ.10 లక్షల నిధులతో గ్రావెల్ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం బద్దెంపల్లిలో కేసీఆర్ క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పల్లె రమేశ్ గౌడ్, శ్రీనివాస్, జెల్లా మొండి, ఉప సర్పంచ్ మహేశ్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఆత్రం గణపతి, పీఏసీఎస్ చైర్మన్ కుబిడే మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## సుందరీకరణ పనులు పూర్తి చేయాలని వినతి

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 7 : రాముని చెరువు అభివృద్ధి సుందరీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్యకు శనివారం సింగరేణి విశ్రాంత కార్మిక సంఘం నాయకులు, వాకర్స్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. చెరువులో దుర్వాసన వెదజల్లుతున్న దృష్ట్యా పూడిక తీయించాలని, హైటెక్ సిటీ వైపు ఉన్న కట్టను అభివృద్ధి చేయాలని, జాఫర్ నగర్ హైటెక్ సిటీ నుంచి వస్తున్న డ్రైనేజీ నీటిని చెరువులో కలువకుండా చూడాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో గజెల్లి వెంకటయ్య, కే ప్రభాకర్, శంకర్, నర్సింగరావు, స్వరూప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

జన్నారం, అక్టోబర్ 7 : రాబోయే శాసనసభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని జన్నారం తహసీల్దార్ వనజారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ మాదాడి సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటికే 29 గ్రామాల్లో ఓటరు లిస్టును అతికించామని, మీ ఓటు ఉన్నదో లేదో చూసుకోవాలన్నారు. అంతకుముందు పశువైద్యాధికారి శ్రీకాంత్ కస్తూరి మాట్లాడుతూ పాడి పశువులకు వ్యాధుల నివారణ టీకాలు వేశామన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా 48 మంది లబ్ధిదారులకు గొర్రెలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుణారాణి, వైస్ ఎంపీపీ సుతారి వినయ్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, హరిణి, జక్కు భూమేశ్, నైనాల తిరుపతి, గంగాధర్, వాణి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

## కవ్వాల్ ఫారెస్ట్ డిప్యూటీ కన్జర్వేటర్ బదిలీ

జన్నారం, అక్టోబర్ 7 : డివిజన్‌లోని కవ్వాల్ టైగర్ రిజర్వ్‌డ్‌లో డిప్యూటీ కన్జర్వేటర్‌గా పని చేసిన సిరిపురం మాధవరావు ఎఫ్‌డీవోగా హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌కు బదిలీపై వెళ్లనున్నట్లు తెలిసింది. మాధవరావు జన్నారం డివిజన్‌లో నాలుగున్నర సంవత్సరాలుగా అటవీ శాఖలో విధులు నిర్వహించారు.



సిరిపురం మాధవరావు

## యువకుల రక్తదానం

మంచిర్యాల ఏసీసీ, అక్టోబర్ 7 : మంచిర్యాల పట్టణంలోని సంజీవయ్య కాలనీ కి చెందిన బీఆర్ఎస్ పార్టీ వార్డు ఇన్‌చార్జి వెంకటసాయి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రభుత్వ దవాఖానలో గల రక్తనిధి కేంద్రంలో శనివారం 15 మంది యువకులతో కలిసి రక్తదానం చేశారు. వారిని లయన్ వీ.మధుసూదన్ రెడ్డి అభినందించారు.ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పడాల రవీందర్, బీఆర్ఎస్ సీనియర్ మెంబర్ ఖాజా మీయా, బ్లడ్ మోటివేటర్ అబ్దుల్ రహీం, ప్రేమ్ కుమార్ సింగ్, యువకులు, రక్తనిధి కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.